# ధర్మమా? కామమా?



***యూయం వయం వయంయూయం***
***మిత్యాసన్మతి రావయోః***
***కింజాత మధునా యేన***
***యూయం యూయం వయం వయం***

***భావం:*** మీరు మేమే, మేము మీరేనన్నట్లుగా మన ఇద్దరి భావమూ ఉండేది. ఇప్పుడు ఏమయినదో కానీ మీరు మీరే మేము మేమే అన్నట్లుగా ఉంది.

సుందరీ నందకుమారులది అనుకూలమైన దాంపత్యం. ధన ధాన్య సమృద్ధి ఉన్న కుటుంబం కనుక వారికి అనుక్షణమూ ఆనందంగా గడిచేది.

నదీ తీరాలలో, ఉద్యానవనాలలో విహరించేవారు. మాధవీలతకూ, మామిడి చెట్టుకూ వివాహ మహోత్సవం జరిపించేవారు. దాగుడు మూతలాడుకునేవారు. సరదాగా పందెం కట్టి జూదం ఆడేవారు. వెన్నెల చల్లదనాన్ని అనుభవించేవారు. చంద్రకాంత శిలా మండపాలలో హంసతూలికా తల్పాలలో హాయిగా నిద్రించేవారు. నృత్య గానాలతో సంతోషించేవారు. ఒకరిని వదిలి ఒకరు ఒక్కక్షణమైనా ఉండేవారు కాదు. అసలున్నది ఇద్దరు వ్యక్తులా లేక ఒక్కరేనా అన్నట్లుగా ఉండేవారు. 'నువ్వే నేనే నేనే నువ్వు' అన్న పాట ఇద్దరి పెదవులపై ఎల్లప్పుడూ కదలాడుతుండేది.

కాలం గడిచింది. సుందరీ, నందకుమారులకు ఒక కొడుకు పుట్టాడు. కుమారుడి సంరక్షణలో సుందరి అలసిపోయేది. భార్య ముందువలె విహారానికి రానందుకు నందకుమారుడికి కోపం వచ్చేది. సుందరి అనునయించేది. అతడు సర్దుకునే వాడు. ఇంకొంత కాలం గడిచింది. వారికి కుమార్తె కలిగింది. వృద్ధులైన నందకుమారుడి తల్లిదండ్రులు కొడుకువద్ద నివసించసాగారు. అత్త మామల సేవలో పిల్లల పెంపకంలో సుందరికి పని ఎక్కువైంది. ఆమె చాలా శాంత స్వభావురాలు. ప్రేమ స్వరూపిణి. వృద్ధులైన అత్తమామలకు కానీ పసివారైన పిల్లలకు కానీ ఏ లోటు రానిచ్చేది కాదు. సాధ్యమైనంత వరకూ పనులు తొందరగా పూర్తి చేసుకుని భర్తతో ఎక్కువ సమయం గడిపేది.

కానీ నందకుమారుడిలో అసంతృప్తి పెరిగిపోయింది. పూర్వమంత ఆనందంగా గడపడం లేదని విసుగు కలిగింది. జీవితమంతా హాయిగా, ఆనందంగా గడపాలని అతని కోరిక. తనతోనే ఎల్లకాలమూ ఉండని భార్య మీద అతనికి కోపం వచ్చింది. ఆ కోపం పోవడానికి ఇంకొక స్త్రీపై కోరికగా మారింది. మధువాణి అనే వేశ్య అతడు కోరుకున్న విహారాలూ. సరససల్లాపాలూ అందించసాగింది.

భర్త ఇంట్లో ఉండడం తగ్గించిన విషయాన్ని సుందరి గమనించింది. అతనింట్లో లేకపోవడానికి కారణం ఊహించింది. అతనితో మామూలుగా మాట్లాడుతున్నట్లుగానే " నిన్న రోజు మొత్తం ఇంటికి రాలేదు. అత్తమామలు నీకోసం చాలాసేపూ ఎదురుచూశారు. ఎక్కడకు వెళ్లావు" అని అడిగింది.

"పనుంటే వెళ్ళాను. అన్ని పనులూ నీకు చెప్పే చెయ్యాలా?"

సుందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గృహిణి ధర్మాలు నిర్వహిస్తున్నందున అనుక్షణమూ అతని సన్నిధిలో ఉండలేకపోయింది. అయినంత మాత్రాన ఇంత నిరాదరించవచ్చునా? ఆమె నెమ్మదిగా అంది. 'నువ్వే నేను, నేనే నువ్వు అన్నది ఒకప్పటి మాట. ఏం జరిగిందో ఎందుకిలా అయిందో కానీ నేను నేనే  నువ్వు నువ్వే.'

చాలా సంసారాల్లో ఈ కథ నేటికీ జరుగుతూనే ఉంది. వివాహమైన తర్వాత కొత్తల్లోని మోజు తగ్గిపోవడాన్నే పాశ్చాత్యులు సెవెన్ ఇయిర్ ఇచ్ అంటారు. మన పూర్వీకులు వివాహ కర్మలో ధర్మం, కామం అనే వరుసని నిర్దేశించారు. ధర్మ నిబద్ధత లేకుండా కామానికే విలువ ఇచ్చిననాడు స్త్రీ గతి ఏం కావాలి?

******